ఎన్పీడీసీఎల్ ఎస్ఈగా రాజేశ్వర్ రావు



మద్యం మత్తులో రాణాలో హంగామా



## 'గేట్' ర్యాంకర్‌కు కలెక్టర్ అభినందన



**అక్షరటుడే, ఇందూరు:** 'గేట్' అర్హత పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన శ్రీచందనను కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి శనివారం అభినందించారు. భీమ్‌గల్ మండలం జాగిర్యాలకు చెందిన దేవేందర్, స్రవంతి దంపతుల కుమార్తె శ్రీచందన 81.67 శాతం మార్కులతో 302వ ర్యాంకు సాధించింది. ఎలాంటి శిక్షణ లేకుండా సొంతంగా అభ్యసించి తొలి ప్రయత్నంలోనే మంచి ర్యాంక్ సాధించడం అభినందనీయమని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. భవిష్యత్తులోనూ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



## ఉద్యోగుల ఐక్యతతో సమస్యల పరిష్కారం

**అక్షరటుడే, ఇందూరు:** ఉద్యోగులు ఐకమత్యంగా ఉన్నప్పుడే సమస్యలను పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ కార్యాలయంలో మెగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరి సహకారంతో సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కారం చేసుకుంటున్నామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి చొరవతో ప్రతినెలా రూ.700 కోట్లు ఉద్యోగుల పెండింగ్ బిల్లులు మంజూరవుతున్నాయని తెలిపారు. అనంతరం కాన్ఫరెన్స్ హాల్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజీబ్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాశెట్టి సుమన్ కుమార్, శేఖర్, మాజీ అధ్యక్షులు రాజారాం, నరసింహారావు, టీఎన్జీవోస్ కేంద్ర సంఘ ఉపాధ్యక్షుడు గైని గంగారం, కామారెడ్డి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వెంకటరెడ్డి, నాగరాజు, జగిత్యాల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాగేందర్ రెడ్డి, అమరేందర్ రెడ్డి, టీఎన్జీవోస్ కేంద్ర కార్యదర్శి పోల శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు సతీష్ కుమార్, సహ అధ్యక్షులు పెద్దోళ్ల నాగరాజు, చిట్టి నారాయణరెడ్డి, కోశాధికారి దినేష్ బాబు, సునీత పాల్గొన్నారు.

**విద్యాశాఖలో డీసీఈబీ (డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు) కార్య దర్శి పాత్ర అత్యంత కీలకం. ఎలాంటి ఆరోపణలు లేనివారు ఈ పోస్టు కు అర్హులు. ప్రత్యేకించి సంఘాలతో సంబంధం లేని వారిని ఎంపిక చేయాల్సి ఉంటుంది. కానీ నిజామాబాద్ డీసీఈబీగా మరోసారి సీతయ్యను కొనసాగిస్తూ డీఈవో అశోక్ ఉత్తర్వులు జారీ చేయడం విద్యాశాఖలో చర్చకు దారి తీసింది.**

- అక్షరటుడే, నిజామాబాద్

## డీసీఈబీ కార్యదర్శి నియామకంలో

# నిబంధనలకు పాతర..




- డీఈవో నిర్ణయంపై విమర్శలు
- మూడోసారి కూడా నియమించడంపై శాఖలో తీవ్ర చర్చ

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని డిచ్‌పల్లి మండలంలో పీజీ హెచ్‌ఎంగా పని చేస్తున్న సీతయ్య గత రెండు పర్యాయాలుగా డీసీఈబీ కార్యదర్శిగా కొనసాగుతున్నారు. కాగా.. ఆయనను మరో దఫా కొనసాగించాలని డీఈవో నిర్ణయించారు. వాస్తవానికి డీసీఈబీ సర్వసభ్య సమావేశంలో డీఈవోతో పాటు పలువురు సభ్యులు ఉంటారు. వీరందరి నిర్ణయం మేరకే సభ్యుల్లో ఒక్కరిని సెక్రెటరీగా ఎంపిక చేయాలి. కానీ శుక్రవారం జరిగిన సమావేశంలో డీఈవో అశోక్ ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. తానే స్వయంగా పేరును ప్రకటించడం, సభ్యులను ఒప్పించడం, చివరకు హడావుడిగా అధికారికంగా ఉత్తర్వులను సైతం జారీ చేయడం గమనార్హం. దీని వెనుక రకరకాల ప్రచారాలు తెరపైకి వస్తున్నాయి. మరోవైపు లెక్క పద్దులపై ఎలాంటి చర్చ జరగకుండా కేవలం 20 నిమిషాల్లో సమావేశం ముగించడం ఏమిటని పలువురు చర్చించుకుంటున్నారు.

### నిబంధనలు పక్కన పెట్టి..

డీసీఈబీ సెక్రెటరీగా నియమితులు అయ్యేవారు పీజీ హెచ్‌ఎంల సీనియారిటీ జాబితాలో మొదటి వరుసలో ఉండాలి. దీనికి తోడు కార్యాలయానికి సమీపంలో లేదా.. 8 కిలోమీటర్ల పరిధిలో పని చేస్తుండాలి. ప్రభుత్వ మేనేజ్‌మెంట్ స్కూల్ హెచ్‌ఎంలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి. కానీ తాజా నియామకంలో ఈ నిబంధనలను పక్కన పెట్టారు. తన హయాంలో అంతా నిబంధనల మేరకు జరుగుతుందని, ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం ఉండదని తనకు తాను ప్రకటించుకునే డీఈవో అశోక్.. డీసీఈబీ కార్యదర్శి నియామకంలో ఈ నిబంధనలు లెక్క చేయకపోవడం కొసమెరుపు. పైపెచ్చు రెడ్డిల సంఘం మారు పేరుతో కలిగిన ఓ ఉపాధ్యాయ సంఘం నాయకుడు ఈ నియామకం వెనుక లాబీయింగ్ జరిపారని విద్యాశాఖలో చర్చ జరుగుతోంది.

### ఆరోపణలెన్నో..

డీసీఈబీ సెక్రెటరీగా ఎన్నికైన సీతయ్యపై ఆది నుంచి పలు ఆరోపణలు ఉన్నాయి. సంఘాల్లో క్రియాశీలకంగా వ్యవహరించడంతో పాటు బీఆర్ఎస్ నేతలతో చట్టపట్టాలేసుకుని తిరిగేవారని ప్రచారంలో ఉంది. ముఖ్యంగా ఈయన హయాంలో పలుమార్లు ప్రశ్నాపత్రాలు లీకేజీ కాగా.. ఇందుకు బాధ్యుడిగా ఓ క్లర్క్‌పై చర్యలు తీసుకొని మమ అనిపించారు. కాగా.. ఇవేమీ లెక్క చేయకుండా.. సీతయ్యను మరోసారి సెక్రెటరీగా నియమిస్తూ డీఈవో ఉత్తర్వులు ఇవ్వడం విద్యాశాఖలో సరికొత్త వివాదాలకు తెరలేపింది.

## ఉమ్మడి జిల్లా డీసీసీ అధ్యక్షుల నియామకం





**అక్షరటుడే, నిజామాబాద్‌సిటీ/కామారెడ్డి:** కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుల నియామకం ఎట్టకేలకు ఖరారైంది. ఈ మేరకు ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ కేసీ వేణుగోపాల చారి ఉత్తర్వులు జారీ చేశారు. నిజామాబాద్ డీసీసీ అధ్యక్షుడిగా నగేశ్ రెడ్డి నియమితులయ్యారు. కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఆ పార్టీ నిజాంసాగర్ మండల అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ పేరును ప్రకటించారు. అలాగే నిజామాబాద్ నగరాధ్యక్షుడిగా బొబ్బిలి రామకృష్ణను నియమించారు.

### సీనియర్ నేతగా గుర్తింపు..

నిజామాబాద్ డీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన నగేశ్ రెడ్డి పార్టీలో సీనియర్ నేతగా ఉన్నారు. పీసీసీ కార్యదర్శి, ప్రధానకార్యదర్శి కొనసాగారు. ఆయన గతంలో నిజామాబాద్ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా కూడా పనిచేశారు.

### ఎమ్మెల్యేల మద్దతుతో..

కామారెడ్డి డీసీసీ అధ్యక్ష పదవికి 28 మంది దరఖాస్తు చేశారు. కానీ, ప్రధానంగా మాజీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ రావు, ఏలే మల్లికార్జున్ మధ్యనే పోటీ ఉంటుందని అంతా భావించారు. అయితే కైలాస్ శ్రీనివాస్ రావునే తిరిగి నియమించాలని నాయకులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. కానీ పార్టీ అనూహ్యంగా మల్లికార్జున్ పేరు ఖరారు చేసింది.




## ఎన్పీడీసీఎల్ ఎస్ఈగా రాజేశ్వర్ రావు



**అక్షరటుడే, ఇందూరు:** ఎన్పీడీసీఎల్ నిజామాబాద్ ఆపరేషన్ సూపరింటెండెంట్ ఇంజినీర్గా రాజేశ్వరరావు శనివారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న రవీందర్ కామారెడ్డికి బదిలీ అయ్యారు. రాజేశ్వరరావు ఆర్మూర్ డీఈగా పనిచేస్తూ పదోన్నతిపై నిజామాబాద్కు వచ్చారు. గతంలో నిజామాబాద్ ఏఈఏడీఈగా రాజేశ్వరరావు విధులు నిర్వహించారు. నిజామాబాద్ బాలుర పాలిటెక్నిక్ కళాశాల పూర్వవిద్యార్థిగా అనేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు, యూనియన్ సభ్యులు ఆయనను సన్మానించారు.



## వీహెచ్పీ, బజరంగ్దళ్ ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం

**అక్షరటుడే, ఇందూరు :** వీహెచ్పీ, బజరంగ్దళ్ ఆధ్వర్యంలో శనివారం రక్తదానం శిబిరం నిర్వహించారు. హుతాత్మత దివస్ను పురస్కరించుకొని రెడ్క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వీహెచ్పీ కార్యాలయంలో శనివారం రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వీహెచ్పీ, బజరంగ్దళ్ సభ్యులు మాట్లాడుతూ అయోధ్యలో కట్టడాన్ని కూల్చివేసేందుకు ఎంతోమంది కర సేవకులు తమ ప్రాణాలను త్యాగం చేశారన్నారు. వారి త్యాగాలను గుర్తు చేస్తూ రెడ్క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వీహెచ్పీ విభాగ్ కార్యదర్శి తమ్మలి కృష్ణ, జిల్లా అధ్యక్షుడు దినేష్ ఠాకూర్ జి, జిల్లా కార్యదర్శి గాజుల దయానంద్, కోశాధికారి నాంపల్లి శేఖర్, జిల్లా సహకార దర్శి ధాత్రిక రమేష్, జిల్లా సేవాప్రముఖ్ రాంప్రసాద్ చటర్జీ, నగర కార్యదర్శి బాసోల్లా నీకేష్, బజరంగ్ దళ్ నగర సంయోజక్ అఖిల్, నగర సాహ సంయోజఖ్ అఖిలేష్, బండి వెంకటేష్, సోను, సుధీర్, రాహుల్, బోయిన్పల్లి కృష్ణ, నితిన్, సంతోష్, గణేష్, సంపత్, రెడ్ క్రాస్ డాక్టర్ రాజేష్ పాల్గొన్నారు.



## ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

**అక్షరటుడే, గాంధారి:** ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉండాలని ఎల్లారెడ్డి డివిజినల్ సీహెచ్వో ఠాగూర్, సీహెచ్వో గోవిందారెడ్డి అన్నారు. మండలం పరిధిలోని తిప్పారం తండాలోని అంగన్వాడీ సెంటర్, ప్రాథమిక పాఠశాలలో ఇమ్యునైజేషన్ సెంటర్లను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలన్నారు. ఇమ్యూనైజేషన్ సెంటర్లను పరిశీలించి గర్భిణులకు, పాలిచ్చే తల్లులకు పలు సూచనలు చేశారు. అలాగే చిన్నారులు, వృద్ధులకు చలికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రతిఒక్కరూ విధులను సక్రమంగా నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సుశీలాదేవి, ఆరోగ్య కార్యకర్తలు అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో పోలీస్ స్టేషన్లో హంగామా

**అక్షరటుడే, కామారెడ్డి:** ఆంధ్ర నుంచి వచ్చిన పోలీసులపై దాడికి యత్నించిన ఏడుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన రామారెడ్డిలో శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. బాధిత మహిళ, పోలీసుల కథనం ప్రకారం..రామారెడ్డి మండలం మద్దికుంటకు చెందిన రమేష్ బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లాడు. అతడు దుబాయిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పశ్చిమగోదావరి జిల్లా భీమవరం ప్రాంతానికి చెందిన బూసి బేబీ అనే యువతితో ప్రేమలో పడ్డాడు. అనంతరం తనను లోబర్చుకుని సుమారు రూ.12 లక్షలు, 8 తులాల బంగారాన్ని కాజేశాడని బాధితురాలు ఆరోపించింది. తనను మోసం చేసి పాల్వంచ మండలం ఇసాయిపేటకు చెందిన మరో యువతితో వివాహం చేసుకున్నట్లుగా ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఆంధ్రలోని భీమవరంలో రమేశ్పై కేసు నమోదైంది. బాధితురాలు ఫిర్యాదు మేరకు భీమవరం రూరల్ ఎస్సై వీర్రాజుతో పాటు మరో ఇద్దరు కానిస్టేబుళ్లు శుక్రవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో మద్దికుంటకు మఫ్టీలో వచ్చారు. వారిపై రమేశ్, అతని బంధువులు సైతం పోలీసులపైకి దాడికి దిగారు. వెంటనే భీమవరం పోలీసులు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని నిందితులను పోలీస్స్టేషన్కు తరలించారు. మద్యంమత్తులో ఉన్న రమేష్, అతని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు కలిసి పోలీస్ స్టేషన్లో హంగామా చేశారని పోలీసులు పేర్కొన్నారు.





# మహిళల ఆత్మగౌరవం నిలిపేలా ఇందిరమ్మ చీరల పంపిణీ

**అక్షరటుడే, ఇందూరు:** మహిళల ఆత్మగౌరవాన్ని నిలిపేలా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ చీరల పంపిణీ నిర్వహిస్తోందని రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాల సలహాదారు సుదర్శన్ రెడ్డి అన్నారు. కలెక్టరేట్ లో శనివారం ఎమ్మెల్యేలు భూపతిరెడ్డి, ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, పైడి రాకేష్ రెడ్డి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డితో కలిసి మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. మహిళల అభ్యున్నతికి తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కోటి మంది మహిళలకు కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మహిళల ఆత్మ గౌరవాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈసారి నాణ్యమైన చీరలను తయారు చేయించిందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నాసిరకం చీరలు అందించారని గుర్తు చేశారు. అర్హులైన మహిళకు ఇందిరమ్మ చీరలు పంపిణీ అయ్యేలా పారదర్శకంగా, ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే ప్రభుత్వం అన్ని జిల్లాలకు సరిపడా చీరలను చేరవేసిందన్నారు. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వైపు పిల్లలు పెడదారి పట్టకుండా కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, భూపతిరెడ్డి, రాకేశ్ రెడ్డి, ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి, వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ అన్వేష్ రెడ్డి, కలెక్టర్వినయ్ కృష్ణారెడ్డి, నుడా ఛైర్మన్ కేశ వేణు, అదనపు కలెక్టర్, అదనపు కలెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డి జిల్లాలో కవిత జనంబాట



**అక్షరటుడే, కామారెడ్డి:** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత చేపట్టిన జనంబాట కార్యక్రమాన్ని కామారెడ్డి జిల్లాలో నిర్వహించనున్నట్లు జాగృతి జిల్లా అధ్యక్షుడు సంపత్ గౌడ్ తెలిపారు. పట్టణంలోని శనివారం ఆర్అండ్బీ గెస్ట్హౌస్లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈనెల 27న నిజాంసాగర్ మండలం నుంచి బాన్సువాడ, జుక్కల్, ఎల్లారెడ్డి కామారెడ్డి నియోజకవర్గాల్లో జనంబాట కార్యక్రమంలో భాగంగా కవిత పర్యటన ఉంటుందన్నారు. 28న కామారెడ్డి జిల్లా కేంద్రంలో ప్రజాసంఘాలు, మేధావులతో కమిటీగా సమావేశమవుతారని పేర్కొన్నారు. జనంబాట కార్యక్రమాన్ని ప్రజలు, కవిత అభిమానులు విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో తెలంగాణ జాగృతి రాష్ట్ర ఆటో యూనియన్ అధ్యక్షుడు ఎండీ సలీం, రాష్ట్ర జాగృతి ఉపాధ్యక్షుడు కొట్టాల్ యాదగిరి, కామారెడ్డి జిల్లా జాగృతి యూత్ అధ్యక్షుడు అధిల్, జుక్కల్ నియోజకవర్గ జాగృతి ఇన్ఛార్జి రాజశేఖర్, జుక్కల్ నాయకులు బాల్రాజ్, బీసీ జాగృతి జిల్లా అధ్యక్షుడు రవీందర్ పాల్గొన్నారు.

## రైస్మిల్లు పనులు నిలిపివేయాలి

**అక్షరటుడే, గాంధారి:** మండలంలోని జువాడి గ్రామంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న రైస్మిల్లును వెంటనే నిలిపివేయాలని జువ్వాడి గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్ రేణుక చవాన్కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నం.100లో చుట్టు పక్కల ఇళ్లు ఉన్నప్పటికీ రైస్మిల్ నిర్మాణం చేస్తున్నారని వివరించారు. వెంటనే నిర్మాణాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జువ్వాడి గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం

**అక్షరటుడే, బాన్సువాడ:** నస్రుల్లాబాద్ మండలంలో నెమ్లి గ్రామానికి చెందిన చిట్టి వీరయ్య ఆర్థిక ఇబ్బందులతో బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని స్థానిక బీజేపీ బాన్సువాడ నాయకులు, ఎన్నారై కోనేరు శశాంక్కు తెలపగా ఆయన వీరయ్య కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. రూ.20వేలు ఆర్థికసాయం చేశారు. అలాగే ఇటీవల మండలంలోని ఎక్స్రోడ్ ప్రాంతానికి చెందిన లక్ష్మణ్ రావు నెమ్లి సాయిబాబా దేవాలయం సమీపంలోని డ్రెయినేజీలో పడి మృతి చెందాడు. లక్ష్మణ్ కుటుంబాన్ని సైతం శశాంక్ పరామర్శించారు. మండల కేంద్రంలోని పూసల సురేష్ ఆరోగ్యం బాగాలేక మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను శశాంక్ పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సాయం చేశారు. ఆయన వెంట బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు సున్నం సాయిలు, శ్రీనివాస్, నారాయణ, అనిల్, యాదగిరి గౌడ్, కంది పెద్ద మల్లేష్, చందూరి సాయిలు, రామ్రెడ్డి, నాగరాజ్ గౌడ్, చుక్కన్న గోపి ఉన్నారు.




## డాక్టరేట్ అందుకున్న విశాఖ గంగారెడ్డి

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కొటార్మూర్ విశాఖ కాలనీ వ్యవస్థాపకుడు వేల్పూర్ గంగారెడ్డి (విశాఖ) డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు ఆయన శనివారం వివరాలు వెల్లడించారు. అమెరికా విజ్డమ్ పీస్ యూనివర్సిటీ, ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ అకాడమీ కమిటీ గౌరవ సభ్యుల నుంచి పాండిచ్చేరిలో ఈ డాక్టరేట్ అందుకున్నారు. రోటరీ క్లబ్ సభ్యుడిగా సేవలు, సమాజ సేవలకు గాను డాక్టరేట్కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విశాఖ కాలనీ ఆలయ కమిటీ సభ్యులు, కుటుంబ సభ్యులు ఆయనకు అభినందనలు తెలిపారు.




## స్మైల్స్ స్కూల్లో 'ఎల్లో కలర్డే'

**ఆర్మూర్ పట్టణంలోని స్మైల్స్ ద స్కూల్లో శనివారం ఎల్లో కలర్ డేను ఉత్సాహంగా నిర్వహించారు. చిన్నారులందరూ యెల్లో కలర్ థీమ్లో వివిధ ఆట వస్తువులతో సందడి చేశారు. పసుపు రంగులో ఉన్న పూలు, పండ్లు, పసుపు, వివిధ రకాల వస్తువుల గురించి ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్, కరస్పాండెంట్ షబానా గౌహర్, డైరెక్టర్ రఫీ గౌహర్, ఉపాధ్యాయుల, విద్యార్థులు పాల్గొన్నారు.**

– అక్షరటుడే, ఆర్మూర్

## చలో జగిత్యాల్ – గల్ఫ్ గోస సభను విజయవంతం చేయాలి



**అక్షరటుడే, ఆర్మూర్ :** జగిత్యాల్లో గల్ఫ్ గోస సభను విజయవంతం చేయాలని ప్రవాస భారతీ యుల హక్కుల సంక్షేమ వేదిక అధ్యక్షుడు కోటపాటి నరసింహం నాయుడు కోరారు. పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జగిత్యాల్ లో 23న గల్ఫ్ గోస సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గల్ఫ్ కార్మికు ల సంక్షేమ బోర్డు, ఎన్నారై పాలసీ సాధనకు జిల్లాలోని గల్ఫ్ కార్మికులు అధికసంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. గల్ఫ్ మృతుల కుటుంబాలకు ఇస్తున్న రూ.5లక్షలను 18దేశాలకు వర్తింపజేయాని ఆయన కోరారు. వీటిని సాధించుకునేందుకు సభ ఏర్పాటు చేశామని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎల్లుల్ల నరేష్ పాల్గొన్నారు.

## చోరీకి పాల్పడిన మహిళ అరెస్ట్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఇంట్లో ఎవరూ లేని సమయంలో చోరీకి పాల్పడిన మహిళను అరెస్టు చేసి రిమాండ్కు తరలించినట్లు వన్ టౌన్ ఎస్హెచ్వో రఘుపతి తెలిపారు. కుమార్గల్లీకి చెందిన ఇంటి యజమాని గంగా కిషన్ ఇంట్లో ఈనెల 13న ఇంటి బెడ్ రూంలోని సేఫ్ లాకర్లో బంగారం, వెండి, కొంత డబ్బులు పెట్టి గంగాకిషన్ తదితరులు బయటకు వెళ్లారు. ఈనెల 19న బంగారం కోసం చూడగా కనిపించలేదు. అనుమానంతో సీసీ కెమెరాలు పరిశీలించగా.. వారి ఇంటి ఫస్ట్ ఫ్లోర్లో పనిచేసే గాయత్రి అనే మహిళ ఇంట్లో ఎవరూ లేని సమయంలో డుబ్లికేట్ తాళంతో ఇంట్లోకి చొరబడింది. ఇంట్లో ఉన్న బంగారం, వెండి నగదును దొంగిలించుకుని పోయినట్టుగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు నిందితురాలు హారిక అలియాస్ గాయత్రి (37) అదుపులోకి తీసుకొని విచారించగా తాను చేసిన నేరాన్ని ఆమె ఒప్పుకుంది. అనంతరం ఆమె వద్ద నుంచి 8 తులాల బంగారం 1300 గ్రాముల వెండి రూ.50 వేల స్వాధీనం చేసుకొన్నారు. గాయత్రిని రిమాండ్కు తరలించినట్లు ఎస్హెచ్వో రఘుపతి పేర్కొన్నారు.



## ముప్కాల్లో అమ్మవారి ఆలయానికి విరాళం

**అక్షరటుడే, ముప్కాల్:** మండల కేంద్రంలో ఇటీవల నిర్మించిన నూతన అమ్మవారి ఆలయానికి ముంబైలో స్థిరపడిన సావెల్ గ్రామానికి చెందిన గుండు మనోహర్ విరాళం అందజేశారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులను శనివవారం కలిసి రూ.లక్ష అందజేశారు. గతంలో ఆలయ నిర్మాణంలో భాగంగా సైతం రూ. 75వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తాయని వారు పేర్కొన్నారు.



## విద్యార్థులకు షూ వితరణ

**అక్షరటుడే ఆర్మూర్:** జక్రాన్పల్లి మండలం చింతలూరు ప్రాథమిక పాఠశాలలోని 50 మంది విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో శనివారం షూలను అందజేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఛైర్మన్, స్పాన్సర్ రాస ఆనంద్, క్లబ్ మాజీ అధ్యక్షుడు రాజనీష్ కీరాడ్, కార్యదర్శి ఖందేశ్ సత్యం, సురేష్ కుమార్, మారుతి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములు, ఉపాధ్యాయుల విద్యార్థులు పాల్గొన్నారు.



## పోతంగల్లో ఫుడ్ ఫెస్టివల్..

**అక్షరటుడే, కోటగిరి:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఫుడ్ ఫెస్టివల్ ఘనంగా నిర్వహించారు. ఫుడ్ ఇన్ఛార్జీలు షబానా బేగం, మాధవి ఆధ్వర్యంలో ఫుడ్ ఫెస్టివల్ను నిర్వహించగా హెచ్ఎం సాయిలు ప్రారంభించారు. పాఠశాలలోని విద్యార్థులు దాదాపు 50 రకాల వంటలను తయారు చేసుకుని వచ్చారు. అధికారులు ఉపాధ్యాయులు వివిధరకాల వంటకాలను రుచిచూసి అభినందించారు. హరియాణా వంటకాలు, పూరీ కీర్, బజ్జ రోటీ, చుర్మా, జొన్నరొట్టె, శకినాలు, పలు రకాల వంటకాలు చేశారు. విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని హెచ్ఎం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ వంటకాలు చేసిన విద్యార్థులను విజేతలుగా నిర్ణయించి బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యాదవ్, ఉపాధ్యాయులు, నాగనాథ్, రామారావు, చందర్, నిర్మల, లత, వనజ, సుజాత, రమాదేవి విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులలో కనీస సామర్థ్యాలను పెంపొందించాలి

**అక్షరటుడే, బాల్కొండ :** విద్యార్థులలో కనీస సామర్థ్యాలను పెంపొందించాలని ఎంఈవో బట్టు రాజేశ్వర్ సూచించారు. ముప్కాల్ మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల కనీస సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక కృషి చేయాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని, విద్యార్థులను మూడు గ్రూపులుగా విభజించి బి గ్రేడ్ను ఏ గ్రేడ్కు తీసుకువచ్చేలా చూడాలన్నారు. అటెండెన్స్ ఉదయం 10 గంటల్లోపు నమోదు చేయాలని, మధ్యాహ్న భోజన వివరాలను ప్రతిరోజూ ఆన్లైన్లో అప్డేట్ చేయాలని సూచించారు.